క్లుప్తంగా

జయంతి ఉత్సవాలకు ఆహ్వానం

అలంపూర్: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను ఆహ్వానించినట్లు స్వామి వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు రజనీబాబు తెలిపారు. కర్నూల్‌లో నివాసం ఉన్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని, ఎమ్మెల్యే విజయుడిని వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు బుధవారం కలిసి ఆహ్వానించారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను వారికి అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు కామాక్షి, రంగస్వామి, సంజీవ నాయుడు, మల్లికార్జున్, ప్రశాంత్ ఉన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ధరూరు: మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల్లో 6,7,8వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ చింతమళ్ల రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 5వ, 6వ, 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు 6,7,8వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. హాల్ టికెట్లను వచ్చే నెల 23న వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, మార్చి 3న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

గట్టులో ముగ్గుల పోటీలు



గట్టు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ రకాల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. విజేతలకు సర్పంచు ధనలక్ష్మి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గురుకుల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ గోపీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లకు మరమ్మతు



కేటీదొడ్డి: మండల కేంద్రంలోని ప్రజాపాలనలో భాగంగా బుధవారం ఇండ్లపై వేలాడుతున్న ఎల్‌టీ లైన్ విద్యుత్ వైర్లను ఏడీఈ ఆదేశాల మేరకు సరిచేశారు. ఎక్కడైన ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు ఉంటే లైన్‌మెన్‌కు, అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చెన్నమల్లప్పస్వామి ఉత్సవాలు

మానవపాడు: మండలంలోని మద్దూరులో బుధవారం ఘనంగా కాకె చెన్నమల్లప్పస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నంది ధ్వజకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు సంబరంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దదిన్నెలో క్రికెట్ టోర్నమెంట్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పెద్ద దిన్నె లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 17వ తేదీ నుంచి గ్రామ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు యూత్ సభ్యుడు మధు కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీలో గెలుపొందిన టీమ్‌లకు మొదటి బహుమతి రూ. 20వేలు, రెండో బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

14న అంతర్రాష్ట్ర భజన పోటీలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీ వీరాపురంలో అభయాంజనేయస్వామి రథోత్సవం సందర్భంగా ఈనెల 14న అంతర్రాష్ట్ర భజన పోటీలు నిర్వహించనున్నట్లు భక్త మండలి సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన టీమ్ సభ్యులు 9542351616, 9848532941 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజోళి: మండంలోని మాన్‌దొడ్డిలో వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఖాదర్ బాషా వివరాల ప్రకారం.. మాన్‌దొడ్డికి చెందిన రంగస్వామి(38) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తాగొచ్చి ఇంట్లో గొడవపడేవాడు. ఈ నెల 8వ తేదీన ఇంట్లో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆయన సోదరుడు శ్రీరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదృశ్యమైన వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం

- ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు
- క్యాతూర్ పీహెచ్‌సీలో పెరుగుతున్న ప్రసవాలు
- సిబ్బంది కొరతతో అవస్థలు



మహిళలకు పరీక్షలు చేస్తున్న మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ, అలంపూర్ సీహెచ్‌సీలో ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య బృందం సేవలు అందిస్తోంది. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు రోగులకు అందుబాటులో ఉంటూ అందిస్తున్న సేవలు భేష్‌గా ఉన్నాయని ప్రజలు, రోగులు కొనియాడుతున్నారు. ప్రతి రోజూ 70 నుంచి 80 ఓపీలు ఉంటున్నాయి. పీహెచ్‌సీకి సంబంధించి, అలంపూర్ అర్బన్‌తో కలిపి 8 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఇందులో సబ్‌సెంటర్‌కు ఇద్దరు చొప్పున 16 మంది ఏఎన్‌ఎంలు ఉండాలి కానీ 12 మందే ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఖాళీగా ఉంది. ముగ్గురు స్టాఫ్ నర్స్‌లకు గాను ఒకరు రెగ్యులర్, ఒకరు కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా ఒక స్టాఫ్‌నర్స్, ఓపీ తీసుకునేందుకు ఏఎన్‌ఎం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 8సబ్ సెంటర్లకు ఒక్కరే హెల్త్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్నారు. సబ్‌సెంటర్లలో, పీహెచ్‌సీలో మందుల కొరత కనిపిస్తోంది. మూడు నెలల నుంచి క్యాతూర్ పీహెచ్‌సీలో 7,647 మంది రోగులకు చికిత్స అందించారు. మండలంలోని 197 మంది గర్భిణులకు ఎంసీహెచ్ కిట్లను నమోదు చేసి, వారికి ధన్వంతరం రాకుండా డీటీ వ్యాక్సిన్ ఇచ్చారు. 174 మంది బాలింతలు రాగా, 139 మందికి ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేశారు. 58 సాధారణ కాన్పులు, 81 శస్త్ర చికిత్స కాన్పులు చేశారు. 553 మంది 4 నెలలోపు పిల్లలకు 5 రకాల జబ్బులు రాకుండా టీకాలు వేశారు. పీహెచ్‌సీలో రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అవసరమైన చికిత్స అందిస్తున్నారు.



క్యాతూర్ పీహెచ్‌సీ వైద్యశాల

వైద్య సేవలు బాగున్నాయి..



క్యాతూర్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది రోగులకు, ప్రజలకు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయి. రోగులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కావల్సిన మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

– సుజాత, గర్భిణి, తక్కశిల

ప్రజలకు అందుబాటులో వైద్యం



క్యాతూర్ పీహెచ్‌సీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందిస్తోంది. ప్రజల కోసం 24గంటలు ఆస్పత్రి అందుబాటు ఉంది. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకోవాలి. వైద్య సిబ్బంది కొరత ఉన్నా దాన్ని అధిగమించి రోగులకు సేవలు అందిస్తున్నాం. ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక పరీక్షలు పీహెచ్‌సీలో నిర్వహిస్తున్నాం.

– ప్రసూనరాణి, మండల వైద్యాధికారిణి

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



బల్గెరలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: మండలంలోని బల్గెర, అంతంపల్లి గ్రామాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. బల్గెరలో 'మనఊరు–మనబడి' పథకం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.20 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, పల్లెప్రకృతి వనం, రూ.5లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతంపల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ 60 ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సాధ్యం కాని ఎన్నో అభివృద్ధి పనులను తెలంగాణ సాధించుకున్న తర్వాత కేసీఆర్ హయాంలో 9 ఏళ్లలో సాధించి చూపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, గద్వాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడు, అంతంపల్లి సర్పంచు ఆంజనేయగౌడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అధికారులు దూరం..

బల్గెర, అంతంపల్లి గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు మండల స్థాయి అధికారులు దూరంగా ఉండడం చర్చంశనీయంగా మారింది. అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలపై పదవులు కోల్పోయిన నేతల పేర్లు ఉండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

బాలికలకు క్రీడా సామగ్రి పంపిణీ



గట్టు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల బాలికలకు బుధవారం జెడ్పీటీసీ బాసు శ్యామల క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హనుమంతునాయుడు జన్మదినం సందర్భంగా కస్తూర్బా పాఠశాల బాలికలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. బాలికలు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని జెడ్పీటీసీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి గోపీలత, బల్గెర మాజీ సర్పంచు సామేలు, రాజునాయుడు, గోపాల్, రాజగోపాల్, వీరేష్, నర్సింహ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు



మానవపాడులో కవాతు చేస్తున్న పోలీసులు



రాజోళిలో కవాతులో ఆర్‌ఏఎఫ్ బలగాలు

మానవపాడు: ప్రశాంత వాతావరణం కోసమే రాపిడ్ యాక్షన్ ఫోర్స్ నిర్వహిస్తున్నామని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, ఎస్‌ఐ రాము తెలిపారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారుల గుండా కవాతు నిర్వహించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటారని భరోసా కల్పిస్తున్నామన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు విపత్తుల నుంచి రక్షించడానికి రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సహాయపడుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా కవాతు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: ప్రజల శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు ఉన్నారనే భరోసా ఇవ్వడానికే పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు సీఐ శివశంకర్‌గౌడ్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో శాంతినగర్ ఎస్‌ఐ నరేష్, హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డిపాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. ప్రతి రెండేళ్లకోసారి హైపర్ సెన్సివిటి(సమస్యాత్మక) ప్రాంతాల్లో జరిగే ఈ కవాతులో భాగంగా ఎస్‌ఐ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించింది. త్వరలో ఎంపీ ఎన్నికలు ఉండడంతో పాటు, ప్రజల్లో అభద్రతా బావం తొలగించి, శాంతి భద్రతల స్థాపనలో భాగస్వామ్యం చేసే విధంగా ఈ కవాతు నిర్వహించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

అయిజ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతో ఇటీవల మండలంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వాపోయారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను రోడ్డుపైకి తెచ్చినా, వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా ఉన్నా సరే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సరిగ్గా ఉండాలని సూచించారు. మోటార్ సైకిల్‌పై త్రిబుల్ రైడింగ్ చేసినా, వాహనాలను అతి వేగంగా నడిపినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా చర్యలు తీసుకంటామని హెచ్చరించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



శాంతినగర్: ఉపాధ్యాయసంఘం పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం ఆవిష్కరించారు. మండల విద్యాధికారి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు, శాంతినగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శామ్యూల్ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ మండలశాఖ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషన్న, మక్బూల్, విజయసారథి రెడ్డి, అజయ్‌కుమారి, గోపాల్, ఊషన్న, సిద్దయ్య, మనోహర్, సురేష్‌కుమార్, చెన్నారెడ్డి, వినోద్‌సింగ్, రూపాబాయ్, సరిత పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి సారించండి



పాఠశాలలో సమస్యలు వివరిస్తున్న విద్యార్థిని

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బాలల సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను బాల, బాలికలు సభ దృష్టికి తెచ్చారు. మరుగుదొడ్లు, క్రీడామైదానం, శుభ్రత, ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల కొరతపై వివరించారు. తల్లిదండ్రులు కల్పించుకుని పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. సమస్యలపై కలెక్టర్, ముఖ్యమంత్రికి పోస్టుకార్డు ఉద్యమం ద్వారా చేరవేయాలని తీర్మానించారు. స్పందించిన సర్పంచ్ బతుకన్న ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు వివరించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హనిమిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పుష్పలత, ఉప సర్పంచ్ సంజీవనాయుడు, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ సుధాకర్, ఉపాధ్యాయులు సూర్యబాబు, మద్దిలేటి, తిరుపతయ్య, వీరేష్, మజీద్, ప్రభ, దేవి పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

అయిజ: మండలంలోని సంకాపురంలో బుధవారం గ్రామస్థాయి వాలిబాల్ టోర్నమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తెచ్చిపెట్టాలని కోరారు. కార్యక్రమంలో రాముడు, క్రీడాకారులు, నిర్వాహకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేశం అభివృద్ధి పథంలో నడుస్తోంది



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్న తాండ్రపాడులో స్టేట్ బ్యాంక్ మేనేజర్ అశోక్ కుమార్ వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం దేశం ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ యోజన, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి విప్లవాత్మక పథకాలు కోట్లాది మంది లబ్ధిదారులకు ఉద్యోగ, ఉపాధి కల్పించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మల్దకల్: మండల కేంద్రంలో దామ నర్సింహులు (60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు రంజిత్‌కుమార్‌లు వేరువేరుగా బుధవారం మల్దకల్ గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందాం

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు.
- రైతు వేదిక, పాఠశాల గదులు ప్రారంభం



శింగవరంలో పాఠశాల గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజేయుడు



స్థలదాతను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అలంపూర్ రూరల్: నియోజవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే విజేయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని శింగవరం–2 గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన పాఠశాల గదిని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు ప్రారంభించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. మండలంలోని బుక్కాపురంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.12 లక్షలు, పంచాయతీరాజ్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన రైతు వేదికను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ రూపాదేవిలు ఉన్నారు. అంతకుముందు గ్రామంలో అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్గా, వాల్మీకి ఆలయంలో పూజలు చేశారు.

నాయకుల మధ్య వాగ్వివాదం

వ్యవసాయశాఖకు సంబంధించిన అధికారులు లేకుండా రైతు వేదికను ఎలా ప్రారంభిస్తారని కొంత మంది కాంగ్రెస్ నాయకులు వాగ్వివాదానికి దిగారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉండగానే ఇరు పార్టీల నాయకులు తోపులాట జరిగింది. గ్రామస్తులు సర్దిచెప్పడంతో సమస్య సద్దు మనిగింది.

స్థలదాతను సన్మానం

బుక్కాపురంలో రైతు వేదిక నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన 85 ఏళ్ల మోరెడ్డి రాములమ్మ, అయ్యపురెడ్డిలను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే శాలువా వేసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అనిత, వసుంధర, మధుసూదన్‌రెడ్డి, అయ్యన్న, అయ్యస్వామి, శ్రీనివాసులు, ఎంపీటీసీ రూపాదేవి, సహకార సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అలంపూర్ లిఫ్ట్ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

అయిజ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉత్తనూరమ్మ (75) అనారోగ్యంతో మృతిచెందింది. ఎమ్మెల్యే విజయుడు అయిజ పట్టణం చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బంగి రంగారావు

గద్వాలన్యూటౌన్: ఎల్‌ఐసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐసీఈయూ గద్వాల బ్రాంచ్ కార్యదర్శి బంగి రంగారావు డిమాండ్ చేశారు. ఎల్‌ఐసీ క్లాస్ వన్, క్లాస్ త్రీ ఆఫీసర్స్ ఇతర ఉద్యోగులు సంయుక్తంగా బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గద్వాల ఎల్‌ఐసీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఉద్యోగుల వేతన సవరణపై ఏడాది గడుస్తున్నా ఇంతవరకు చర్చలకు పిలవడం లేదని పేర్కొన్నారు. ఎల్‌ఐసీ సంస్థలో ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్లలో తగినన్ని ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. నూతన పెన్షన్ విధానంలో ప్రస్తుతం 10 శాతం మేనేజ్‌మెంట్ కాంట్రిబూషన్‌ను 14 శాతానికి పెంచాలన్నారు. ఉద్యోగులు, అధికారుల సమస్యలపై యాజమాన్యపు ఏకపక్ష నిర్ణయాలు సరైనవి కావని చెప్పారు. కార్యక్రమంలో క్లాస్ వన్ ఆఫీసర్లు రాజేందర్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, బషీర్, నరేంద్రబాబు, రాఘవేంద్ర కిషోర్, శివ, వంశీధర్‌రెడ్డి, పద్మావతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంఈఓ సురేష్‌కు ఘనంగా వీడ్కోలు



మార్లబీడులో ఎంఈఓ సురేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ధరూరు: బదిలీపై మల్దకల్ మండలానికి వెళ్తున్న ఎంఈఓ సురేష్‌కు మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మండలంలోని మార్లబీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా పని చేస్తున్న సురేష్ మండల ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల్లో భాగంగా మల్దకల్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లడంతో ఆయనను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఆయా గ్రామాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఎంఈఓగా ధరూరు మండలంలోనే కొనసాగుతున్నానని, హెచ్‌ఎంగా మాత్రమే బదిలీ అయ్యానని సురేష్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోతులగిద్దలో రోడ్లపైనే మురుగు



కోతులగిద్దలో సీసీ రోడ్లపై పారుతున్న మురుగు

ధరూరు: మండలంలోని కోతులగిద్దలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్లపై పారుతూ పాదచారులను ఇబ్బందులకు గురి చేస్తోంది. గ్రామంలోని ఆయా కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించడం మరిచారు. దీంతో రోడ్ల వెంట పారుతున్న మురుగు పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది. ఐదేళ్ల క్రితం అన్ని గ్రామాల్లో ఇంటింటికి ప్రభుత్వం ఇంకుడు గుంతలు నిర్మించినా వాటిని ఉపయోగంలోకి తీసుకురాలేదు. ఇటీవల దోమల కారణంగా విషజ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నా, అధికారులు, సర్పంచులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసన మహిళలు



ఇరుముడితో అయ్యప్ప మాలధారుడు

అయిజ: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు బుధవారం ఆలయంలో ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయలు దేరారు. ఈ సందర్భంగా ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహానికి అర్చకులు అభిషేకాలు చేశారు. మాల ధరించిన భక్తులు పడిపూజ నిర్వహించారు. ఇరుముడి కట్టుకున్న అయ్యప్ప భక్తులను శబరిమలకు సాగనంపేందుకు వివిధ గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

కంటి వైద్య పరీక్షలు

ఆత్మకూర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వివేకానంద సేవాసమితి, నేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వభారతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు చేశారు.